వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 159 శుక్రవారం | 22 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5

## 50 పడకలతో ప్రత్యేక వార్డు

కోవిడ్ నేపథ్యంలో ముందస్తు చర్యలు

ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్




8లో



2లో

## రేపు పీవీ 19వ వర్ధంతి

స్వస్థలం వంగర గ్రామంలో కార్యక్రమాలు



# పాస్ లేకుంటే.. నో ఎంట్రీ




- వాకర్స్‌కు ట్యాంక్ బండ్ కాంట్రాక్టర్ హెచ్చరిక
- నెలకు రూ.400 చెల్లించాలంటూ హుకుం
- గతంలోనూ ఇదే తంతు
- మాజీ చీఫ్ విప్ ఆదేశాలతో పరిష్కారం
- ఆయన ఓటమితో మొదటికొచ్చిన సమస్య
- ఉచిత ఎంట్రీనే ముద్దంటున్న వాకర్స్

ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భద్రకాళి ట్యాంక్ బండ్ సొమ్మొకడిది.. సోకొకడిది అన్న చందంగా మారింది. హృదయ్ పథకం కింద రూ.31కోట్లతో ఏర్పాటు చేసిన బండ్‌ను లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్ తనే సొంతంగా దీనిని నిర్మించినట్లు ఫీలవుతూ వాకర్స్‌కు చుక్కలు చూపించేందుకు యత్నిస్తున్నారు. దీంతో ఆహ్లాదం దేవుడెరుగు.. కనీసం ఆరోగ్యం కూడా అందని ద్రాక్షలా మారుతోంది. సగటున రోజుకు రూ.లక్షకు పైగా ఆదాయం వస్తున్నా ఇది చాలదన్నట్లు వ్యవహరిస్తూ నెలకు రూ.400 చెల్లించి వాకర్స్ పాస్ తీసుకున్న వారే జనవరి 1 తేదీ నుంచి ట్యాంక్ బండ్ పై అడుగు పెట్టాలంటూ హుకుం జారీ చేయడంపై వాకర్స్ మండిపడుతున్నారు. గతంలో మాదిరిగానే వాకర్స్‌కు ఉదయం వేళ ఉచిత ఎంట్రీ కొనసాగించాలని వారు కోరుతున్నారు. లేకుంటే బండ్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు సిద్ధపడుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్




వివరాలు 2లో..



2లో..

## మెడికేర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

7.5 కిలోల కణితి తొలగింపు



8 లో..

## తెల్లారిన బతుకులు

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

ముగ్గురికి తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి సీతక్క





# పాస్ లేకుంటే.. నో ఎంట్రీ

**వాకర్స్‌కు ట్యాంక్ బండ్ కాంట్రాక్టర్ హెచ్చరిక**

**నెలకు రూ.400 చెల్లించాలంటూ హుకుం**

**గతంలోనూ ఇదే తంతు**

**మాజీ చీఫ్ విప్ ఆదేశాలతో పరిష్కారం**

**ఆయన ఓటమితో మొదటికొచ్చిన సమస్య**

**ఉచిత ఎంట్రీనే ముద్దంటున్న వాకర్స్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్ ట్యాంక్ బండ్ ను తలపించేలా వరంగల్ నగరంలో అభివృద్ధి చేసిన భద్రకాళి ఫోర్త్ షోర్ బండ్ కాంట్రాక్టర్ కు కాసుల వర్షం కురిపిస్తుంది. వారాంతపు సెలవులు, పండుగల సమయంలో భద్రకాళి సరస్సు పరిసర ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. చారిత్రక భద్రకాళి సరస్సు వద్ద అభివృద్ధి చేసిన థీమ్ పార్క్ అందాలను చూసి సందర్శకులు మంత్ర ముగ్ధులవుతున్నారు. హృదయ్ పథకం కింద మంజూరైన రూ.21 కోట్లతోపాటు కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) వివిధ పనులకోసం మరో రూ.10 కోట్లను వెచ్చించి అభివృద్ధి చేశారు. 2016లో చేపట్టిన ఈ జియో–బయో–డైవర్సిటీ కల్చరల్ పార్క్ కు 1.1 కి.మీ పొడవైన ఫోర్‌షోర్ బండ్ గ్రీన్ కోలోనేడ్‌లు, ఓపెన్–ఎయిర్ జిమ్, ఇథిలీన్ ప్రొపైలిన్ డైన్ మోనోమర్–మేడ్ వాకింగ్ ట్రాక్, ప్లే ఏరియా, ఇంటిగ్రేటెడ్ ల్యాండ్‌స్కేప్ లైటింగ్, పార్కింగ్, ఇతర సౌకర్యాలతో పాటు, సుందరమైన లేక్ ఫ్రంట్ వంటి సౌకర్యాలతో నిర్మించారు. నగరంలోనే అత్యంత సుందరంగా నిర్మించిన ఈ బండ్ ను రోజుకు సుమారు 800 నుంచి 1,000 మంది సందర్శిస్తారని అధికారులు అంచనా వేసినప్పటికీ.. వారి సంఖ్య సగటున మూడు వేలకు మించుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వారంతాల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతున్నట్లు సమాచారం.

## వాకర్స్ పై కొరడా..

పెద్దలకు రూ.30, చిన్న పిల్లలకు రూ.20గా ప్రవేశ రుసుము వసూలు చేస్తున్న కాంట్రాక్టర్ వాకర్స్ పై కొరడా ఝులిపిస్తున్నారు. బండ్ ప్రారంభ సమయంలో వాకర్స్ నెలకు రూ.400 లేదా సంవత్సరానికి రూ.4000 చెల్లించి కార్డు తీసుకోవాలని, వారినే పార్క్ లోకి అనుమతిస్తామంటూ హెచ్చరించారు. దీంతో ప్రభుత్వ నిధులతో నిర్మించిన బండ్ పై వాకర్స్ ను ఎందుకు అనుమతించరంటూ ఆందోళనకు దిగారు. గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. విషయాన్ని అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఆయన కాంట్రాక్టర్ తో మాట్లాడి ఉదయం వేళ వచ్చే వాకర్స్ కు ఎలాంటి రుసుము లేకుండా ఎంట్రీ కలిపించారు. ఉదయం ఏడు గంటలవరకే ఫ్రీ ఎంట్రీ అంటూ సూచించారు. దీంతో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది ఉదయం 5 గంటలనుంచే బండ్ కు చేరుకొని తమ నడకను కొనసాగిస్తూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు.

## మళ్లీ అదే హెచ్చరిక..

అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఓటమిపాలు కావడంతో కాంట్రాక్టర్ తిరిగి అదే హెచ్చరికను జారీ చేశారు. ఇకపై ఉచిత ఎంట్రీలు లేవని ప్రకటిస్తున్నారు. జనవరి 1వ తేదీ నుంచి రూ.400 చెల్లించి పాస్ తీసుకున్న వారిని మాత్రమే లోనికి అనుమతిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు పార్క్ లోని పలు ప్రాంతాల్లో నోటీసులు అంటించారు.

## ఆందోళనలో వాకర్స్..

నిత్యం 200నుంచి 300మంది వాకర్స్ బండ్ పై తిరుగుతూ తమ ఆరోగ్యాలకు కాపాడుకుంటున్నారు. ఇందులో ఎక్కువ శాతం మంది మధ్య తరగతికి చెందిన వారే. అయితే ఇదేమీ పట్టించుకోకుండా నెలకు రూ.400 చెల్లించాలంటూ డిమాండ్ చేయడంపై వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగానే ఉదయం వేళ వాకర్స్ కు ఫ్రీ ఎంట్రీ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రడ్డితో పాటు జిల్లా మంత్రి కొండా సురేఖ స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వాకర్స్ కోరుతున్నారు.

# మెడికేర్‌లో అరుదైన శస్త్ర చికిత్స

**7.5 కిలోల కణితి తొలగింపు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హనుమకొండ జిల్లా హంటర్ రోడ్డులోని ఫాదర్ కొలంబో వైద్య కళాశాల, మెడికేర్ హాస్పిటల్ వైద్యులు సంయుక్తంగా శుక్రవారం అరుదైన శస్త్ర చికిత్సను ఎంతో కష్టపడి విజయవంతం చేశారు. కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన 65 సంవత్సరాల వృద్ధురాలు తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ మెడికేర్ హాస్పిటల్ లో చేరగా సిటీ స్కానింగ్ చేసిన వైద్యులు కడుపులో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. గైనకాలజీ జనరల్ విభాగానికి చెందిన వైద్యులు ఓపెన్ సర్జరీ నిర్వహించి కడుపులో ఉన్న ఏడున్నర కిలోల కణితిని తొలగించారు. ఈ చికిత్సలో గైనకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ సంధ్యారాణి బృందంతోపాటు జనరల్ సర్జన్ డాక్టర్ ప్రతాపరెడ్డి పాల్గొని ఈ చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో సర్జరీ విజయవంతం చేసిన డాక్టర్ల బృందాన్ని కేర్ హాస్పిటల్ డైరెక్టర్ చిన్నప్ప రెడ్డి, డాక్టర్ బిల్లా మహేందర్ రెడ్డి అభినందించారు. ఈ చికిత్స ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యాధునిక వైద్య సేవలు మెడికేర్ హాస్పిటల్ ఓ అందుబాటులో ఉన్నాయని నిరూపించారన్నారు. మెడికేర్ హాస్పిటల్‌లో ఈఎన్ టీ, గైనకాలజీ, జనరల్ సర్జన్, ఆర్థో, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ విభాగాల్లో ఉచితంగా ఓపీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితోపాటు ఉచిత ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని కేర్ హాస్పిటల్ డైరెక్టర్లు, వైద్యులు తెలిపారు.

# రేపు పీవీ 19వ వర్ధంతి

**స్వస్థలం వంగర గ్రామంలో కార్యక్రమాలు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత పూర్వ ప్రధాని స్థిత ప్రజ్ఞ, ఆర్థిక సంస్కరణల పితామహుడు స్వర్గీయ పీవీ.నరసింహారావు 19వ వర్ధంతి సందర్భంగా డిసెంబరు 23 శనివారంనాడు ఉదయం 8 గంటలకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం న్యూ బస్టాండ్ కూడలిలోని ఆయన కాంస్య విగ్రహానకి పుష్పాంజలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ జర్నలిస్టు పీవీ. మదన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 9గంటలకు భీమదేవరపల్లి మండలంలోని పీవీ స్వస్థలం వంగర గ్రామంలో జరిగే కార్యక్రమంలో రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పీవీ.నగర్ కూడలిలోని కాంస్య విగ్రహానకి పుష్పాంజలి ఘటించి సంస్మరణ సభలో పాల్గొంటారన్నారు. పీవీ కుమారుడు ప్రభాకర్ రావుచే ఏర్పటు చేసిన మ్యూజియంను సందర్శిస్తారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

# మేడారంలో 33 పార్కింగ్ స్థలాలు

**ఏర్పాట్లను పరిశీలించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అంకిత్**



**వరంగల్ వాయిస్, మేడారం :** సమ్మక్క సారక్క జాతర సందర్భంగా మేడారం పరిసరాల్లో మొత్తం 33 పార్కింగ్ స్థలాలను ప్రతిపాదించినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అంకిత్ వెల్లడించారు. సాగులో ఉన్న పొలాలను పరిశీలించారు. గ్రౌండ్ లెవలింగ్ పనులకు రైతులను సమీకరించాలని సూచించారు. శుక్రవారం మేడారంలో చేపట్టిన వివిధ పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో పోలీసు అధికారులు, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులు, సంబంధిత సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించి ప్రతిపాదిత పార్కింగ్ స్థలాలపై సమీక్షించారు. ప్రతి శాఖ అధికారులు ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ 15 రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పార్కింగ్ స్థలాల రోజువారీ స్థితి నివేదికలను పోస్ట్ చేయడానికి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌ను రూపొందించాలని ఆదేశించారు. పార్కింగ్ స్థలాల విషయంలో రైతులతో ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జె.వసంత్ రావు , ములుగు డీఎస్పీ ఎన్.రవీందర్, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, సీఐ వి.సురేష్, ఎస్సై బి.ఓంకార్, డిప్యూటీ తహశీల్దార్ జె.సురేష్ బాబు, పూర్ణ చందర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

**విద్యార్థులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి దిశానిర్దేశం**



**వరంగల్ వాయిస్, ములుగు జిల్లా ప్రతినిధి :** విద్యతోపాటు క్రీడారంగాల్లో వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకొని అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం స్థానిక డీఎల్ ఆర్ గార్డెన్ లో జిల్లా యువజన, క్రీడల శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు - 2023, యువజన కళాకారుల ఎంపిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా కారులుగా ఎదగాలన్నారు. ప్రతిభకు ఎలాంటి ఆటంకాలు అడ్డు రావన్నారు. చాలా మంది క్రీడాకారులు పేదరికం నుంచి గొప్ప స్థాయికి ఎదిగిన వారేనని గుర్తు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి వెంకయ్య, జిల్లా వైద్య అధికారి అప్పయ్య, విద్య శాఖ అధికారి పాణిని, సంబంధిత అధికారులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ముందడుగు

## విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యతోనే సమాజంలో గౌరవం–ముందడుగు సాధ్యమని, శాస్త్రీయ ప్రణాళిక –పునశ్చరణతో పరీక్షల్లో విజయం సాధించవచ్చునని, విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం అన్నారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. శుక్రవారం ఆయన సచివాలయంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లా విద్యాశాఖ అధికారి, అన్ని యాజమాన్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆదేశించారు. బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేష్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రేరణ సదస్సులు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమం రూపకర్త సైకాలజిస్ట్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫలితాలను పెంపొందించుటకు పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు సైకాలజిస్ట్ సంఘం సహకారంతో నిర్వహించనున్నామని, విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141 లలో సంప్రదించాలని తెలిపారు. అనంతరం అతిథులు కార్యక్రమ పోస్టర్లు, బ్యానరు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేణు తదితరులు పాల్గొన్నారు.

# కుల గణనపై సీఎం ప్రకటన హర్షనీయం

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో కుల గణన నిర్వహించి బీసీ కులాల లెక్కలు తీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షాన్ని వ్యక్తం చేశారు. బీసీ కుల గణన వల్ల ఆయా కులాల ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ, పరిస్థితులు తేట తెల్లమవుతాయన్నారు. దేశ వ్యాప్తంగా అనేక రాజకీయ పార్టీలు బీసీ సంఘాలు కులగణన చేయాలని అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలలో కులగణనపై తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించిన కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయడం వలన బీసీల అభివృద్ధి సంక్షేమం ఎడల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తున్నదన్నారు. పాలకుల బీసీ వ్యతిరేక విధానాల వలన ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలన్నింటిలో బీసీలకు తీరని అన్యాయమే జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక విధానాలను విడనాడి కుల గణన జరపాలని, దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల రిజర్వేషన్లు 42శాతానికి పెంచిన తర్వాతనే గ్రామ పంచాయితీ ఎన్నికలతో సహా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని కోరారు.

# ఆజం జాహి మిల్లు భూముల్లోనే ఇండ్ల స్థలాలు కేటాయించాలి

## న్యూడెమోక్రసీ నాయకుల డిమాండ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆజంజాహి మిల్లు కార్మికులకు మిల్లు స్థలంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చిందని ఈ తీర్పును అమలు చేయకుండా గత ప్రభుత్వం, కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(కుడా) అధికారులు, కొంతమంది స్వార్థపరులు కుమ్ముక్కై వారికి భూములు దక్కకుండా చేశారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆరెల్లి కృష్ణ ఆరోపించారు. శుక్రవారం 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్ ఏరియాలో న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆరేల్లి కృష్ణ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో కార్మికులకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ ఇంటి స్థలాలు ఇక్కడ ఇవ్వకుండా 30కిలోమీటర్ల దూరంలో ఉన్న కోమటిపల్లి గ్రామంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ కార్మికులకు ప్లాట్లు కేటాయిస్తున్నామని 'కుడా' అధికారులు తప్పుడు పత్రాలతో సుప్రీంకోర్టుకు సమర్పించి కోర్టును తప్పుదారి పట్టించారని ఆయన తెలిపారు. అక్కడ ఎటువంటి సౌకర్యాలు వసతులు లేవని లేఅవుట్ చేసినట్లుగా పేపర్ మీద ప్రకటించి చేతులు దులుపుకున్నారని, దీని వెనుక గత బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారులు ఉన్నారని ఆయన ఆరోపించారు. మిల్లు భూములలో నూతన కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి ఆరు ఎకరాలు పోగా ఇంకా 18 నుంచి 22 ఎకరాల వరకు స్థలం ఉంటుందని ఈ స్థలమును కూడా అధికారులతో పాటు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేసారని కనుక ఈ స్థలంలోనే కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వం కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్ టీయూ నగర ప్రధాన కార్యదర్శి జన్నారం రాజేందర్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత కంటి పరీక్షలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని నర్సంపేట్ రోడ్ లో గల శ్రీ కనకదుర్గ మాత దేవాలయంలో శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. శ్రీ కనకదుర్గ మాత దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత కంటి పరీక్షలను శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ మాట్లాడుతూ శరత్ కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. ఉచిత కంటి పరీక్షలన చాలామంది భక్తులు, మహిళలు, వృద్ధులు వినియోగించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శరత్ కంటి ఆసుపత్రి సిబ్బంది పేరబోయిన మల్లయ్య, ఇందూరి అంశాల్, నవీన్, అజయ్, ఆలయ కమిటీ సభ్యులు సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వరియా, సురేష్ కుమార్, పప్పు వేణు, కొప్పుల శేఖర్, జంగం ప్రభాకర్, ఆకోజు జగన్నాథ చారి, గుల్లపల్లి రామకృష్ణ, గూడ శారద, అర్చకులు గంప శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

# గణిత శాస్త్రంతో మానవాళి నిరంతర ప్రగతి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ధర్మసాగర్ లో రామానుజన్ 136వ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలు కిరణ్మయి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ గణిత భావనలపై ప్రదర్శనలు నిర్వహించారు. గణిత వర్కింగ్ మోడల్స్ తయారుచేసి నిజ జీవన సమస్యల పరిష్కారంలో అవి ఎలా ఉపయోగపడతాయో తెలియజేశారు. దళిత క్విజ్, పజిల్స్ తో విజ్ఞాన వినోద మేళవింపులతో గడిపారు. తదనంతరం జరిగిన ముగింపు సమావేశంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడుధర్మ ప్రకాష్ మాట్లాడుతూ గణితంలో జరుగుతున్న మార్పులు, అభివృద్ధి మానవాళి ప్రగతి కోసం గణిత శాస్త్ర ప్రాముఖ్యత పాఠశాల దశ నుంచే విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలు విజయవంతం కావడానికి ఉపాధ్యాయులు సురేష్, కవిత సహకారం అందించారు. వివిధ గణిత పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

# సస్పెండ్ చేసిన ఎంపీలపై నిషేధం ఎత్తివేయాలి

## ధర్నా చేసిన సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 13న పార్లమెంట్‌లో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని దోషులను శిక్షించాలని, సభలో చర్చకు అనుమతించాలని కోరిన 143 ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులను, నిరవధికంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సీపీఐ, న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో వరంగల్ అండర్ బ్రిడ్జి బస్టాండ్ సెంటర్ లో ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక నియంతృత్వ విధానాలపై నిరసన తెలియజేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం, పార్లమెంట్ సభ్యులపై ఉన్న నిషేధం ఎత్తివేయాలని మొదలైన నినాదాలు చేశారు. ధర్నా చేసిన అనంతరం న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షత సమావేశం వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు బండి కోటేశ్వరరావు లు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలను ఉక్కు పాదంతో అణచి వేస్తున్నదని ప్రతిపక్ష పార్టీల సభ్యులు సభలో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వారిపై నిరవధిక సస్పెండ్ అమలు చేసిందని, ఆ రోజును పార్లమెంటరీ చరిత్రలో బ్లాక్ డేగా వారు అభివర్ణించారు, బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై కలిసికట్టుగా పోరాదామని వారు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె బాషూమియా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్, పీవైఎల్ జిల్లా నాయకులు హరిబాబు, ఎండీ యాకూబ్, మస్క సుధీర్, ఇనుముల కృష్ణ, సుప్రియ, స్వర్ణలత, కుమార్, సుద్దాల వీరయ్యలతో పాటు ఇరు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీజేపీని తరిమి కొడతారు

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న పార్లమెంటు ఎన్నికలలో దేశ ప్రజలు బీజేపీనే తరిమి కొడతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల పార్లమెంటులో సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న విపక్ష పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఇండియా కూటమి పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికార పార్టీని ప్రశ్నిస్తున్నారన్న అక్కసుతో ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కల్గించడమేనని అన్నారు. ప్రజా వ్యతిరేక తమ అనుకూల విధానాలను అమలు చేసుకునేందుకే విపక్ష పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేశారని విమర్శించారు. విపక్షాలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేసిన బీజేపీని 2024ఎన్నికలలో ప్రజలే సస్పెండ్ చేయడం ఖాయమని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. పెట్టు బడి దారులకు వేల కోట్ల రాయితీలు ఇస్తూ పేదలపై పెను భారాన్ని మోపేలా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను, నిత్యావసర వస్తువుల ధరలను పెంచారని అన్నారు. రానున్న ఎన్నికలలో ఇండియా కూటమిని బలపరచి ప్రజా సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ జపం చేస్తున్న బీజేపీని గద్దె దించాలని అన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మంద సదాలక్ష్మి, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, డాక్టర్ పల్లేరు వీరస్వామి, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, బాషబోయిన సంతోష్, కామెర వెంకట రమణ, రాసమల్ల దీనా, సీపీఎం జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, వీరన్న, గొడుగు వెంకట్, మంద సంపత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నిత్యావసరాల పంపిణీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణ ఆర్యవైశ్య ముద్దు బిడ్డ వికాస తరంగిణి జిల్లా కోశాధికారి, ఆర్యవైశ్య మహాసభ రీజియన్ చైర్మన్, వాసవి క్లబ్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్(వీఎన్ కేసీజీఎఫ్ 5) కొండ్లె వెంకటేశ్వర్లు 64వ పుట్టినరోజు సందర్భంగా స్థానిక వెంకటేశ్వర బజారులో గల బీద వృద్ధురాలైన మంచాల సరోజనమ్మ జీవనోపాధి గడవడమే ఇబ్బందిగా ఉన్నదని సేవా దృక్పథంతో సుమారు నెల రోజులకు సరిపోయే కిరాణం సామాను, బట్టలు, బియ్యం, పండ్లు, కూరగాయలు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి పుట్టినరోజు ఇలా బీద మహిళకు ఈ విధంగా సామానులు ఇచ్చే భాగ్యం ఆ భగవంతుడు కలిపించినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉందని, ఇది తన అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ సేవా కార్యక్రమంలో దాత కొండ్లె వెంకటేశ్వర్లు, బోనగిరి శ్రీనివాస్, నాగేంద్ర ప్రదీప్, రేణిగుంట్ల లక్ష్మీకాంతారావు, గుడిపాటి కృష్ణమూర్తి, జంగాల వెంకట్, శ్రీరంగం నరసింహారావు,సాదు మైపాల్ రెడ్డి తదితరులు ఈ సేవలో పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ శశాంక



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ డీఆర్డీఏ పీడీ సన్యాసయ్యతో కలిసి సందర్శించారు. కలెక్టర్ ధాన్యాన్ని పరిశీలించి నిర్వాహకులతో కొనుగోళ్ల తీరును, మాయిచ్చరైజ్ ను పరిశీలిస్తూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తరాదన్నారు. గన్నీబ్యాగుల వివరాలు ఆడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల తీరును రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు స్పందిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరు బాగున్నదని, మార్కెట్ లో ధాన్యంకు మంచి ధర పలకడంతో రైతులు మార్కెట్ వైపే మొగ్గు చూపుతున్నారని, దాంతో మద్దతు ధరకంటే అధిక లాభాలు పొందుతున్నారని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా టోకెన్లు జారీ చేస్తూ, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ లో నమోదు చేస్తూ అదేరోజు రవాణాకు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి రాగానే మాయిశ్చర్ శాతాన్ని పరిశీలించి రైతులకు తెలియజేస్తూ రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా కొనుగోలు చేసిన ధాన్యంలో శాంపిల్స్ ని సేకరించి భద్రపరచాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో వినియోగించే సామాగ్రిని మాయిశ్చర్ మీటర్లు, వేయింగ్ మిషన్లు, టార్పాలిన్ లు, గన్నీ బ్యాగులు అదనంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లో నిలువ చేయరాదని, అదే రోజు రవాణా చేపట్టాలని మిల్లర్లకు ముందుగా సమాచారం అందించాలన్నారు. రైతులకు త్రాగునీరు సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సన్యాసయ్య, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కృష్ణవేణి, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, డీపీఎం నళిని, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, పరకాల :** సుస్థిర సుగంధ ద్రవ్యాల కార్యక్రమం పరకాల మండలం నాగారం గ్రామంలో రైతు వేదికలలో పారస్ పసిడి పంటల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పైసెస్ బోర్డు నుంచి సూదిష్ణ, ఫారస్ నుంచి అనిల్ కుమార్, శివప్రసాద్, గౌరవ్ లు పాల్గొన్నారు. రైతుల అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు అధికంగా రసాయన మందులు వాడుతున్నారని తద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. అధికంగా పురుగు మందులు ఉపయోగించడం వల్ల మనుషులకు అనేక రకాల రోగాలు వస్తున్నాయని తెలిపారు. రైతులు సురక్షితమైన పద్ధతులను ఉపయోగించడం లేదని పేర్కొన్నారు. మనం పండించే పంటలు అధికంగా పురుగుల మందు అవశేషాలు ఉంటున్నాయని తెలిపారు. అలాంటి పద్ధతులకు స్వస్తి చెప్పి సమగ్రమైన సస్యరక్షణ విధానాన్ని అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. దానికి పురుగు మందులు వాడకం తగ్గించి సేంద్రీయ విధానం వైపు రైతులు అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా నేల పరిరక్షించబడుతుందని, మొక్క ఆలస్యంగా పెరిగినా మంచి దిగుబడి, ఉత్పత్తి వచ్చి ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని గుర్తు చేశారు. ఫారస్ కంపెనీ ఎలాంటి పురుగు మందుల అవశేషాలు లేని వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, రైతులు ఐపీఎం పద్ధతిని ఉపయోగించి పంటలు ఉత్పత్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పసిడి పంటల నుంచి కండే.నరేందర్, కే.కృష్ణయ్య, పసిడి పంట సిబ్బంది, బేయర్ క్రాప్స్ సైన్స్ నుంచి పార్థ తిరుపతి, పరకాల, ముస్త్యాలపల్లి, రేగొండ మండలాల, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీడైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# గణితంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



**వరంగల్ వాయిస్, కురవి :** మండలంలోని సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ధరావత్ వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని, శ్రీనివాస రామానుజన్ చిన్నప్పటి నుంచే గణితం మీద ఆసక్తిని పెంచుకొని గణితంలో అనేక రకాల మెలుకువలు నేర్చుకున్నాడు. అందుకే అతని జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్ కుమార్, గొండు మాధవరావు , బగాది తాతారావు, మహమ్మద్ అంజద్ పాషా, షేక్ అస్మత్ పాషా, బానోత్ విజయ్, రాగం సురేష్, బుంగా సంధ్యారాణి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నారాయణలో మ్యాథ్స్ డే వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నక్కలగుట్టలోని నారాయణ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని ఘనంగా మాథ్స్ డే వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పలు కార్యక్రమాలను, మ్యాక్స్ ఫెయిర్ ను పాఠశాల అధ్యాపకులు అలాగే పాఠశాల సిబ్బంది వీక్షించి పలువురు విద్యార్థులను అభినందించారు. పాఠశాలడీజీఎం రిజ్వాన, ప్రధానోపాధ్యాయుడు రమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, పాఠశాల ఈవోనాగరాజు, అధ్యాపకులు, విద్యార్థుల పోషకులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన చల్లా దంపతులు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ బీఆర్ఎస్ నాయకుడు కీ.శే.వజ్ర రవికుమార్–దివ్య కూతురు అలేఖ్య వివాహ వేడుకలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి –జ్యోతి దంపతులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు బాలాజీ హరికృష్ణ ఆచార్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించి స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలాజీ హరికృష్ణ ధర్మపత్ని రిషిత స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు సాయిని దేశపతి, రాజు, ఎల్లంకి రవీందర్, మోట్టం భద్రయ్య, ఏదుల రమేష్, సిద్ధంశెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష పార్టీల ఎంపీల సస్పెన్షన్ దుర్మార్గం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, పార్లమెంట్ లో ప్రతిపక్ష పార్టీల ఎంపీలను అకారణంగా పార్లమెంట్ నుంచి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి సూచనల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ లో భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేసినందుకు పార్లమెంట్ ఉభయ సభల్లో ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ఎంపీలను సస్పెండ్ చేయడం ద్వారా మొత్తం ప్రజా స్వామిక సంప్రదాయాలను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ప్రభుత్వ నియంతృత్వం పరాకాష్టకు చేరిందని మండిపడ్డారు. పార్లమెంట్ ను బీజేపీ కేంద్ర కార్యాలయంగా భావిస్తోంది. దేశంలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని, మర్డర్ అఫ్ డెమోక్రసీ ఇన్ ఇండియా నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, సయ్యద్ విజయశ్రీ రజాలి, టీపీసీసీ కార్యదర్శి సయ్యద్ రజాలి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మిర్జా అజీజుల్లా బేగ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, టీపీసీసీ ఓబీసీ డిపార్టుమెంటు కార్యదర్శి పులి రాజు, జిల్లా ఓబీసీ డిపార్టుమెంటు చైర్మన్ బొమ్మతి విక్రం, ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు పల్లకొండ సతీష్, ఏఐపీసీ అధ్యక్షుడు లడె రమేష్, నల్ల మహాత్మా, టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి రహీమున్నిసా బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, నాయకులు బండారి జనార్ధన్ గౌడ్, బొంత సారంగం, మొహమ్మద్ సమద్, తాళ్లపల్లి మేరీ, ఎస్.కుమార్ యాదవ్, గాండ్ల స్రవంతి, ఎదులపురం లక్ష్మం, శివాజీ, సంగీత్ , ఓరుగంటి పూర్ణ, ఎస్. రవి, సాయిరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ ముందస్తు వేడుకలు



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో గురువారం క్రిస్మస్ ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య కేక్ కట్ చేసి కార్యాలయ సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ఏసుక్రీస్తు డిసెంబర్ 25న జన్మించారని, ఆయన జన్మదినాన్ని గుర్తు చేస్తూ, క్రీస్తు సమాజంలో శాంతి, సహనంతో జీవించాలని బోధించారని, ఎదుటి వారిని ప్రేమిస్తూ జీవించడం నేర్పించారని తెలిపారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విపిన్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ తిరుపతయ్య, జిల్లా స్టోర్స్ ఇంచార్జి, వినోద్, ప్రవీణ్, తిరుపతిరెడ్డి, కిరణ్, సతీష్, శంకర్ మొదలగు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



**వరంగల్ వాయిస్, దామెర :** స్థానిక ఏకశిలప్రైమ్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి పాల్గొని శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ గణిత విభాగంలో చేసిన సేవలు, ఆయన గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. వివిధ రకాల మ్యాథమెటిక్స్ ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించి, గణిత ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్ స్టాఫ్ ఇంచార్జి నవీన్, గణిత ఉపాధ్యాయులు, సుధాకర్, లావణ్య, నాగరాజు, హరీష్, సునీత, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికూడ మండలం నార్లపూర్ గ్రామానికి చెందిన పింగిలి వనిత-కీ.శే సుధాకర్ రెడ్డి కనిష్ఠ పుత్రిక వివాహ వేడుక హసన్ పర్తి సాయిని గార్డెన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వరంగల్ పార్లమెంట్ కాంటెస్టెడ్ ఎంపీ దొమ్మటి సాంబయ్యలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ కళా సౌరభాలు పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజంలో అనాదిగా విస్తరించి ఉన్న అనేక జానపద గిరిజన కళారూపాలు తెలంగాణ సంస్కృతిక శోభకు నిదర్శనమని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్ రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బాచుపల్లి లోని తెలుగు విశ్వవిద్యాలయం కేంద్ర కార్యాలయంలో జానపద గిరిజన విజ్ఞాన పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాసాని సురేష్ రచించిన తెలంగాణ కళా సౌరభాలు పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డా.గడ్డం వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ తంగెడ కిషన్ రావు ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ విశిష్ట అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య తంగెడ కిషన్ రావు మాట్లాడుతూ తెలంగాణాలో వైవిధ్యమైన జానపద కళారూపాల ఉనికి ఉందని, ఇవి తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా ఉండటం గొప్ప విషయమని అన్నారు. ఇక్కడి మట్టిలో పుట్టిన జానపద కళారూపాల్లో ఎక్కువగా ఆశ్రిత కళారూపాలుగా ఉండటం విశేషమని చెప్పారు. జానపద కళలకు సంబంధించిన మౌఖిక సాహిత్యం, కళా నైపుణ్యం, సాంస్కృతిక నేపథ్యం వంటి అరుదైన విషయాలన్నీ రచయిత సురేష్ రాసిన వ్యాసాలలో పరిశోధనాత్మకంగా కనిపిస్తాయని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ తెలంగాణలోని 27జానపద కళారూపాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సురేష్ తన పుస్తకంలో పొందుపరిచినారని అన్నారు. అనంతరం సభాధ్యక్షుడు డా.గడ్డం వెంకన్న మాట్లాడుతూ రచయిత డా.బాసని సురేష్ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో గత 23సంవత్సరాలుగా జానపద గిరిజన విజ్ఞానం మీద పరిశోధన చేస్తూ, పలు పత్రికల్లో పరిశోధనా వ్యాసాలు రాశాడని, ఆ కోవలోనే తెలంగాణాలోని అరుదైన జానపద కళారూపాల గురించి రాసిన వ్యాసాల సంపుటియే ఈ పుస్తకమని ప్రశంసించారు. ఈ పుస్తకం ముందు తరాలకు తెలంగాణ జానపద కళారూపాల సంస్కృతీ వైభవాన్ని చాటుతుందని చెప్పారు. పీఠం అధ్యాపకులు డా.శ్రీమంతుల దామోదర్, డా.చూరపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధకులు రచయిత సురేష్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సిబ్బంది ఆబ్బు గోపాల్ రెడ్డి, డా.గంపా సతీష్, డా.జి.రజిత, ఆచార్య నిరీక్షణ బాబు, ఆచార్య కోట్ల హన్మంతరావు, ఆచార్య వెంకట్రామయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసిస్ట్ల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తా

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహా హామీ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, స్టేట్ అడ్వైజర్ యం డి ముతార్ అహ్మద్ ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, హెల్త్ సెక్రటరీ డా.క్రిస్టినా జడ్ చోంగ్తు లను శుక్రవారం తెలంగాణ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, బోకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, ఎం.అవినాష్, రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్స్ గా మార్చాలని, ప్రతి ఫార్మసిస్టుకు అతని సర్వీసులో కనీసం నాలుగు రకాల ప్రమోషన్స్ ఇవ్వాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు ఫార్మసిస్టులను నియమించాలని, ఫార్మసిస్టులకు పని భారం తగ్గించాలని, ఫార్మసిస్ట్ ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఫార్మసిస్ట్స్ అందరిని రెగ్యులర్ చేయాలని, అన్ని మెడికల్ కాలేజీలలో ఫార్మసిస్ట్ గ్రేడ్ వన్, ఫార్మసీ సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని మంత్రికి విన్నవించగా త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి ఫార్మసిస్టుల సమస్యలు అన్నింటిని కూడా పరిష్కరించుతానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## జాతీయస్థాయి వాలీ బాల్ పోటీలకు గొర్రెకుంట విద్యార్థి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 13, 14,15 న నారాయణపేట ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీ బాల్ పాఠశాలల ఎంపిక క్రీడా పోటీలలో 14 ఏళ్ల విభాగంలో గీసుకొండ మండలం 15వ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎల్.అన్ను పాల్గొని తన క్రీడా ప్రతిభతో ఈనెల 24 నుంచి 27 వరకు ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్ పట్టణంలో జరుగు జాతీయస్థాయి వాలీబాల్ పాఠశాలల క్రీడలలో పాల్గొనే తెలంగాణ బాలికల జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నలిమెల జ్యోతిర్మయి, పీఈటీ జలగం రఘువీర్ తెలిపారు. తన క్రీడా ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఎల్.అన్ను ను, పాఠశాల విద్యార్థులను రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై అనేక పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇస్తున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జలగం రఘువీర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.జ్యోతిర్మయి, స్థానిక కార్పొరేటర్ ఆకుల మనోహర్, విద్యాకమిటీ చైర్మన్ జున్ను కుమారస్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం షహీన్ సుల్తాన, యం.చంద్రశేఖర్, మార్త.శ్రీనివాస్, సీహెచ్ అనిత, పి.ప్రణతికుమారి, యం.ప్రభాకర్, జె.దమరి, ఆర్.రాజు, సీహెచ్ శ్రీదేవి, పీఈటీ, గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

## అట్టహాసంగా గణిత దినోత్సవం



**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజును పురస్కరించుకొని శ్రీనివాస్ గురుకుల్ హైస్కూల్ బాలసముద్రం విద్యార్థిని విద్యార్థులు గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల గణిత ముగ్గులను వేసి ఆహ్వానం పలుకుతూ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు వారి గణిత ఎక్స్ బిట్స్ ని ప్రదర్శిస్తూ చార్ట్స్ రూపంలో వాటిని వచ్చిన అతిథులకు, పాఠశాల యజమాన్యానికి అవగాహన కల్పించారు. తరగతి గదిలో చెప్పిన గణిత పాఠాలకు పరిమితం కాకుండా వారి సొంత ఆలోచనలతో గణిత ఎగ్జిబిట్స్ ను ప్రదర్శించి కొత్త విషయాలను తెలియజేశారు. మొదటి తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులకు కనువిందు కలిగించాయి. తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో తల్లిదండ్రులు విద్యార్థులను మెచ్చుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పైథాగరస్, స్థూపం ఘనపరిమాణం పిల్లలు చాలా చక్కగా వివరించారు. గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని గణిత ప్రశ్న వినోదం (క్విజ్)నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం మాట్లాడుతూ పిల్లలు ప్రదర్శించిన వివిధ గణిత ఎగ్జిబిట్లను చూసి విద్యార్థిని విద్యార్థులతో పాటు అకాడమిక్ ఇంచార్జి మమత, అడ్మిన్ ఇంచార్జి యుగంధర్, ఉపాధ్యాయులు వినయ్, ఉదయ్, రాజేష్, అనురాగ్ ,మహేష్, సుభాష్, ఉపాధ్యాయురాళ్లు శ్రావణి, నవ్య, రాధిక, రజిని, కావ్య, గీత, అనూష, కౌర్, మమత పద్మను అభినందించారు.

# విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

## కాటారం డీఎస్పీ రాంమోహన్ రెడ్డి

**వరంగల్ వాయిస్, కాటారం :** విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించి దేశం గర్వించదగ్గ మేధావులుగా ఎదగాలని కాటారం డీఎస్పీ జి.రాంమోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మ్యాథ్స్ ఫెయిర్ లో డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన పలు గణితశాస్త్ర ప్రాజెక్ట్ లు, వివిధ నమూనాలను ఎస్సై అభినవ్ తో కలిసి ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త







శ్రీనివాస రామానుజన్ ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు గణితంలో రాణిస్తూ అన్ని అంశాలపై పట్టు సాధించాలన్నారు. ప్రతీ ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోని శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు వినియోగపడేలా నూతన ఆవిష్కరణలు సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతం నుంచి నిరంతర కృషితో ప్రపంచం గర్వించే శాస్త్రవేత్తగా ఎదిగిన రామానుజన్, అబ్దుల్ కలాం వంటి మహానీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన మ్యాథ్స్ ఫేయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు రూపొందించిన గణిత శాస్త్ర నమూనాలను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం మ్యాథ్స్ ఫెయిర్ లో విజేతలుగా నిల్చిన వారికి ఎంపీపీ పంతకాని సమ్మయ్య బహుమతులను అందజేశారు. ఎస్సై అభినవ్, పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు బీఏరావు, వెంకట్రాజం, కాంగ్రెస్ యువ నాయకుడు కడారి విక్రమ్ పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చిరుధాన్యాలు ఆరోగ్యానికి వరప్రదాయని అని అనేక వ్యాధుల బారిన పడకుండా రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యంగా ఉండటానికి ఇవి ఎంతో దోహదం చేస్తాయని మిల్లెట్ కుకింగ్ ఎక్స్పర్ట్ కుసుమ కవిత అన్నారు. చిరుధాన్యాల అవగాహన కార్యక్రమం హనుమకొండ శ్రీనగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ లో శుక్రవారం నిర్వహించారు. గృహిణులకు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలపై ఉన్న ఆపోహాలను తొలగించుకొని ప్రతి ఒక్కరూ వీటిని తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలని అన్నారు. వారి రికార్డ్ సర్వీస్ సొసైటీ ముద్రించిన అవగాహన కరపత్రాలను కాలనీలో పంపిణీ చేశారు. మిల్లెట్స్ గురించి ఉచిత సలహాలు, సూచనలకు 91003 73129 నెంబర్లు సంప్రదించవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవాణి, సౌజన్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ శాంతిమార్గం అనుసరించాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ప్రెసిడెంట్, ది నేషనల్ కన్జుమర్ రైట్స్ కమీషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి హనుమకొండలోని ఎవన్గెలికల్ బాప్టిస్ట్ చర్చ్ నిర్వహించిన ప్రీ-క్రిస్మస్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమానత్వం, మానవత్వం, శాంతిమార్గం అనుసరించాలని, అసూయ, ద్వేషాలు వదిలి అందరికి ప్రేమను పంచాలన్నారు. పండుగ అంటే పదిమంది సంతోషంగా కలిసి చేసుకునేదని తెలిపారు. ఏ దేవుడు ఏ మతం చెప్పినా అందరూ కలిసి మెలిసి ఉండాలని, మంచిని అను సరించాలని, మానవత్వం, దయ, కరుణ చూపాలని చెబుతారని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితా రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## ఘనంగా కాకా జయంతి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్, రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ క్యాంప్ కార్యాలయంలో టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో, కాకా గడ్డం వెంకటస్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ నాయక్ మాట్లాడుతూ కాక దేశానికి చేసిన సేవలను కొనియాడుతూ అత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టి మెట్రిక్యులేషన్ వరకు విద్యని అభ్యసించి ఒకపక్క కుటుంబ బాధ్యతలు మోస్తూనే మరో పక్క నిజాం వ్యతిరేకపోరాటం నుంచి తెలంగాణ తొలి దశ, మలిదశ, ముల్కీ, నాన్ ముల్కీ, ఉద్యమాలను ముందుండి నడిపారన్నారు. తెలంగాణ అంశం వచ్చిన ప్రతి సందర్భంలోనూ తెలంగాణ పక్షాన నిలబడి కొట్లాడి, తెలంగాణ వచ్చేంతవరకు నేను జీవిస్తానని తెలంగాణను కళ్లారా చూస్తానని నిరంతరం పరితపించి తెలంగాణను కళ్లారా చూసిన వ్యక్తి వెంకటస్వామి అని తెలిపారు. ఐఎన్టీయూసీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వెన్నమల్ల వెంకటస్వామి, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ తిప్పర్తి శ్రీధర్, మహబూబాబాద్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు చెన్న సీతారాములు, మహబూబాబాద్ జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు బోడ రవి నాయక్, మహబూబాద్ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆరేంద్ర వెంకటేశ్వర్లు చారి, వార్డు కౌన్సిలర్ ఆరింపుల విజయ, మహబూబాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు గుగులోత్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ప్రముఖ ప్రఖ్యాత విశ్వ మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి మ్యాథమెటిక్స్ డేని పురస్కరించుకొని నర్సంపేట మైనార్టీ గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులతో కలిసి ఘనంగా మ్యాథమెటిక్స్ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రకరకాల ప్రదర్శనలతో వారి ప్రతిభను కనబరిచారు. అలాగే విద్యార్థుల మేథోశక్తిని పెంపొందించే దిశగా విద్యార్థులకు మాథ్స్ క్విజ్ కాంపిటీషన్స్, గణితముగ్గుల పోటీలు, గణితం సంబంధించిన ఎగ్జిబిషన్స్ నిర్వహించి విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్ సీ శ్రీ పాల, పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య, గణిత ఉపాధ్యాయ బృందం జయశ్రీ స్వాతి, అనిత, సుమయ్య, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం పాల్గొన్నారు.




## ప్రొఫెసర్ కృష్ణవేణికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, కేయూ :** ఫార్మసి కళాశాలలో కొత్తగా బోర్డు ఆఫ్ స్టడీ చైర్ పర్సన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జానపద రెడ్డి కృష్ణవేణి కి ఆచార్య బృందం, విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కృష్ణవేణి గురించి విద్యార్థిని విద్యార్థులు మాట్లాడుతూ గతంలో ప్రొఫెసర్ కృష్ణవేణి హాస్టల్ జాయింట్ డైరెక్టర్గా ఆరు సంవత్సరాలు పనిచేశారని, ఆపని చేసిన కాలంలో ఆడపిల్లలను సొంత బిడ్డ లాగా చూసుకుంటూ, ఆ సలహాలు, వసతి భోజన, ఆరోగ్యపరంగా, ప్రత్యేకమైన శ్రద్ధ చూపించేవారని ప్రస్తుతం కృష్ణవేణి హెల్త్ సెంటర్ ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రసాద్, ప్రొఫెసర్ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ సమ్మయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సరూప, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ భాగ్య, డాక్టర్ సుజాత, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళకు నిత్యావసర సరుకులు అందజేత

**వరంగల్ వాయిస్, మడికొండ :** మడికొండ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జయరాజు క్రిస్మస్ పండుగ సందర్భంగా మడికొండ గ్రామానికి చెందిన నిరుపేద మహిళకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ తన వంతు సహాయంగా నిరుపేద ప్రజలకు సరుకులు అందించడం నాకు చాలా సంతృప్తినిస్తుందని తెలిపారు.

# దీప్తి జీవన్‌జీని సన్మానించిన కలెక్టర్


**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించిన యువ అథ్లెట్ జివాంజి దీప్తిని శుక్రవారం వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సన్మానించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. దీప్తి విజయం సాధించడానికి ఆమె తల్లిదండ్రులు, ఆర్డీఎఫ్ సంస్థ, కోచ్ లే కారణమన్నారు. పేద కుటుంబంలో జన్మించిన జీవన్ జి దీప్తి కల్లెడ ఆర్డీఎఫ్ లో విద్యనభ్యసించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరుగులలో రాణించి భారత జాతి ఉత్కంఠంగా ఎదురుచూసిన నాల్గో పారా ఆసియన్ గేమ్స్ లో పతకాల వర్షం కురిపించి ప్రధాని నరేంద్ర మోడీ చేత స్వయంగా ప్రశంసించబడ్డ తెలంగాణ తేజం అని కొనియాడారు. 400మీటర్లు 56.69 సెకండ్స్ లో చిరుత వలే పరుగు చేయడం వెనుక ఎంతో కృషి ఉందన్నారు. దీప్తి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని భారత్ తరపున ఒలంపిక్స్ లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం దీప్తి మాట్లాడుతూ తనకు ఇప్పటివరకు ఆర్థిక, సహాయ సహకారాలు అందించిన పెద్దలందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు.

**ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించ లేదు -జీవంజి దీప్తి**



అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన తనకు ప్రభుత్వం నుండిచి ఇంతవరకు ఎలాంటి సహాయ, సహకారాలు అందలేదని దీప్తి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఉండడానికి ఇల్లు లేదని, ప్రభుత్వం ఎలాగైనా తనకు ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు మంజూరు చేయాలని . ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు.

# బ్లాక్ బస్టర్.. ప్రభాస్ అదుర్స్



ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సలార్ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. కేజీయఫ్ 2 లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం కావడంతో మొదటి నుంచే భారీ అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన రెండు ట్రైలర్‌లతో మరింత హైప్ క్రియేట్ చేశాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తెల్లవారుజామునే షోలు పడ్డాయి. సినిమా చూసిన అభిమానులు, ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బాహుబలి తర్వాత ప్రభాస్‌కు సరైన హిట్ పడలేదు. ఆయనతోపాటు ప్రేక్షకులు, అభిమానులు ఈ చిత్రం మీదే నమ్మకం పెట్టుకున్నారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఈ చిత్రం గురించి సోషల్ మీడియా వేదికగా చర్చించారు. సోషల్ మీడియా ఎక్స్(ట్విట్టర్)లో సలార్ చిత్రానికి పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. సినిమా బ్లాక్ బస్టర్ అని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. ప్రభాస్ నటన అద్భుతమని, నట విశ్వరూపాన్ని చూపించాడని ట్వీట్స్ చేస్తున్నారు. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటన కూడా అదిరిపోయిందని అంటున్నారు. ప్రశాంత్ టేకింగ్‌పై ప్రశంసలు వర్షం కురిపిస్తున్నారు. ఫస్టాఫ్ సూపర్ అని, బ్యాగ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎసెట్ అని పేర్కొన్నారు. బ్లాక్ బస్టర్‌తో ఈ ఏడాది ముగించారని కామెంట్ చేస్తున్నారు. కొందమంది వీక్షకులు యావరేజ్ సినిమా అని రాసుకొచ్చారు. సినిమా స్పెక్టాక్యూలర్ అని ఓ క్రిటిక్ రాసుకొచ్చారు. సెకెండాఫ్ ఎమోషన్, యాక్షన్ అదరిపోయిందని, ప్రభాస్ మాస్ మానియా చూపించారని అంటున్నారు.

## యంగ్‌హీరోల కామెంట్స్

సెలబ్రెటీలు కూడా సలార్ సినిమాను తొలిరోజే చూసి థ్రిల్ అవుతున్నారు. టాలీవుడ్ యంగ్ హీరోలు నిఖిల్, నవీన్ పోలిశెట్టి అయితే సినిమా చూసి రివ్యూలు కూడా పెట్టేశారు. ఇప్పుడే సలార్ సినిమా చూశా. మాన్‌స్టర్ బ్లాక్‌బస్టర్ అంతే.. ప్రభాస్ ఒక అద్భుతం. అతను స్క్రీన్‌పై ఉన్నంతసేపు గూస్‌బంప్స్ వచ్చేస్తాయంటూ నిఖిల్ సిద్దార్థ ట్విట్టర్ (ఎక్స్) ద్వారా రివ్యూ ఇచ్చాడు. ఇక యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి కూడా సలార్ చూసి తన అభిప్రాయాన్ని ట్విట్టర్ (ఎక్స్) ద్వారా పంచుకున్నాడు. సలార్ సినిమా థియేటర్ల దగ్గర ఎంతో జోష్ నింపిందని తెలిపాడు. చాలా రోజుల నుంచి అందరూ ప్రభాస్ అన్నను ఇలా చూడాలనే వెయిట్ చేస్తున్నారని అన్నాడు. చెప్పాను కదా బాక్సాఫీస్ బద్దలయిపోద్ది అని అంటూనే.. ప్రభాస్‌కు, సలార్ టీమ్‌కు కంగ్రాట్స్ చెప్పాడు.

## రెండోపార్ట్ శౌర్యాంగపర్వం

సినీ ప్రేక్షకుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన సలార్ థియేటర్లలోకి వచ్చేసింది. బ్లాక్‌బస్టర్ టాక్‌తో దుమ్మురేపుతోంది. ప్రభాస్ కటౌట్‌కు పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేవలం నార్మల్ ఫ్యాన్స్ మాత్రమే కాదు..సెలబ్రిటీలు కూడా సినిమా చూడడానికి పోటీపడ్డారు. ఇప్పటికే అర్ధరాత్రి నుంచి ప్రీమియర్స్, బెనిఫిట్ షోలతో థియేటర్లు మార్మోగిపోతున్నాయి. ఈ చిత్రం అంతటా పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. అయితే ఈ సినిమా ముగింపులో ప్రభాస్ అభిమానులకు ఒక సాలిడ్ అప్‌డేట్‌ను ఉంచాడు ప్రశాంత్ నీల్. ఈ సినిమా క్లైమాక్స్ పూర్తయిన అనంతరం.. ఎండ్ క్రెడిట్స్ వచ్చే ముందు ఓ అదిరిపోయే సర్‌ప్రైజ్‌ను ఇచ్చాడు ప్రశాంత్ నీల్. ఈ సినిమా మొదటి పార్ట్‌కు పార్ట్ 1 సీజ్ అని టైటిల్ పెట్టిన ప్రశాంత్ 'సలార్ పార్ట్ 2కు 'శౌర్యాంగ పర్వం అని టైటిల్ ఫిక్స్ చేశాడు. ప్రాణ స్నేహితులుగా ఉన్న దేవ, వరదలు బద్ద శత్రువులుగా ఎలా మారారో నీల్ ఇందులో చూపించబోతున్నాడు. ఇక ఈ సినిమా 2024 డిసెంబర్‌లో రానున్నట్లు సమాచారం.

## బాహుబలి తరవాత మరో హిట్

సలార్ చిత్రంతో టాలీవుడ్ స్టార్ నటుడు ప్రభాస్ సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. 'బాహుబలి' ఫ్రాంఛైజీ తర్వాత ప్రభాస్ నుంచి ఆశించిన స్థాయిలో సినిమాలు రాలేదు. దీంతో చాలా కాలంగా ప్రభాస్ అభిమానులు హిట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ప్రేక్షకుల ముందుకొచ్చిన సలార్ చిత్రం సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. దీంతో డార్లింగ్ అభిమానుల ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. ఈ సినిమాను చూసేందుకు థియేటర్ల వద్దకు ఫ్యాన్స్ క్యూ కట్టారు. సినిమా థియేటర్స్ వద్ద టపాసులు పేల్చి తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. పలు చోట్ల ప్రభాస్ భారీ కటౌట్స్ ఏర్పాటు చేసి పాలాభిషేకాలు చేసారు. డ్యాన్స్‌లు, డప్పు చప్పుళ్లతో హోరెత్తించారు. కేజీఎఫ్ ఫ్రాంఛైజీ లాంటి ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ హిట్టందించిన ప్రశాంత్ నీల్‌ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. సలార్‌లో శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. జగపతిబాబు, బాబీ సింహా, ఈశ్వరీ రావు, శ్రియారెడ్డి, జాన్ విజయ్, సప్తగిరి, సిమ్రత్ కౌర్, పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. మాలీవుడ్ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ వరదరాజ మన్నార్ ది కింగ్ పాత్రలో నటించాడు.

# డంకీ ఓటిటి హక్కులు రూ.155 కోట్లు

షారుఖ్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'డంకీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పాజిటివ్ టాక్‌తో దూసుకెళుతుంది. దీంతో ఈ సినిమాను చూసేందుకు ఆడియెన్స్ ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ సినిమాకు ఓటీటీకి సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ దిగ్గజం జియో సినిమాస్ రూ.155 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసినట్లు సమాచారం. దీంతో రికార్డు ధరకు డంకీ ఓటీటీ రైట్స్ పోవడంతో షారుక్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే.. పంజాబ్‌లోని ఓ చిన్న గ్రామంలో నలుగురు స్నేహితులు ఇంగ్లండ్ వెళ్ళాలి అనుకుంటారు. అయితే వారు వెళ్లడానికి డబ్బు కానీ, వీసాలకి తగినంత చదువు కానీ ఉండదు. ఈ క్రమంలోనే ఆ ఊరికి వచ్చిన హార్డీ సింగ్ (షారుక్ ఖాన్) వారి పరిస్థితిని అర్థం చేసుకుని ఇంగ్లండ్ తీసుకెళుతానని చెబుతాడు. ఈ ప్రయాణంలో ఎదురైన ఇబ్బందులు ఏంటి? అసలు వాళ్ళు లండన్ కి ఎందుకు వెళ్ళాలి అనుకుంటున్నారు?



# ధనుష్ కెప్టెన్ మిల్లర్ ఫస్ట్ లుక్ రిలీజ్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న మూవీ కెప్టెన్ మిల్లర్. అరుణ్ మథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న కెప్టెన్ మిల్లర్ నుంచి లాంఛ్ ఫస్ట్ సింగిల్ కిల్లర్ లో ధనుష్ కెప్టెన్ మిల్లర్‌గా ఎర్రటి స్కార్ఫ్ కట్టుకొనిచేతిలో తుపాకీతో అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. థియేటర్లలో ప్రభాస్ మేనియా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇక నెక్ట్స్ ఫీవర్ ధనుష్‌దేనంటూ నెట్టింట కెప్టెన్ మిల్లర్ హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్ అవుతోంది. యాక్టింగ్ మాన్‌స్టర్ ధనుష్.. కెప్టెన్ మిల్లర్ ఆన్ ది వే అంటూ క్యూరియాసిటీ పెంచేస్తున్నారు నెటిజన్లు, మూవీ లవర్స్. ధనుష్ కామ్రేడ్ అవతార్‌లో కనిపిస్తూ.. సమరానికి అందరినీ మేల్కొలుపుతున్నట్టుగా ఉన్న కెప్టెన్ మిల్లర్ లుక్ ఇప్పటికే నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ చిత్రంలో కోలీవుడ్ భామ ప్రియాంక అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. సందీప్ కిషన్, నివేదితా సతీశ్, అమెరికన్ యాక్టర్, ఆర్‌ఆర్‌ఆర్ ఫేం ఎడ్వర్డ్ సొన్నెన్‌బ్లిక్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విప్లవయోధుడు కెప్టెన్ మిల్లర్ స్ఫూర్తితో వస్తోన్న ఈ మూవీలో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ (మరో కీ రోల్‌లో నటిస్తున్నాడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. సత్య జ్యోతి ఫిలిమ్స్ తెరకెక్కిస్తున్న కెప్టెన్ మిల్లర్ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# తెల్లారిన బతుకులు

**రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం**

**ముగ్గురికి తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు**

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి సీతక్క**

**వరంగల్ వాయిస్, ములుగు జిల్లా ప్రతినిధి :** ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన ఏడుగురు కారులో వేములవాడ దైవ దర్శనానికి వెళుతుండగా శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మంతెన కాంతయ్య(72), మంతెన శంకర్(60), మంతెన భరత్(29), మంతెన చందన(16) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెలితే..ఎలుకతుర్తి మండలంలోని పెంచికల్‌పేట గ్రామ శివారులో వేగంగా దూసుకొచ్చిన లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం ధాటికి కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు, జేసీబీ సాయంతో కారులో ఇరుక్కుపోయిన వారిని అతికష్టంమీద బయటకు తీశారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. వారంతా ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రానికి చెందినవారుగా గుర్తించారు. వేములవాడ దైవ దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి మంచు ఎక్కువ ఉండటంతో పాటు అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో ఏటూరునాగారంలో తీవ్ర విషాదం అలుముకుంది. మృతదేహాలను వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో పోస్టుమార్టం నిర్వహించి ఏటూరునాగారం తరలించారు. క్షతగాత్రులలో ఒకరు ఎంజీఎంలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నారు. మరో ఇద్దరు వరంగల్ గార్డెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి సీతక్క..



ఘోర రోడ్డు ప్రమాదంపై పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎంజీఎం ఆర్ ఎంఓ బందెల మోహన్ రావుతో ఫోన్ లో మాట్లాడి సమాచారాన్ని తెలుసుకున్నారు. అవసరమైె మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు.





# మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్, అదనపు కలెక్టర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మంత్రి కొండా సురేఖను శుక్రవారం హైదరాబాద్ లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, వరంగల్ జిల్లా ఆదనవు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖేడే మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులపై మంత్రి ఆరా తీసినట్లు సమాచారం.


# వీరన్నా.. నీకు దిక్కేది..!?

**దేవుని సొమ్ము .. దళారుల పాలు**

**దాతల సొమ్మును హరిస్తున్న అక్రమార్కులు**

**అటకెక్కిన ఆలయ అభివృద్ధి**







**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయం పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. ఏటా జనవరిలో జరిగే భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కళ్యాణం చూడటానికి లక్షల్లో జనాలు వస్తున్నా ఆలయం అభివృద్ధి, భక్తుల సౌకర్యాలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు ఆర్థిక సాయం చేస్తుంటే, అభివృద్ధి పనుల పేరుతో ఆ సొమ్ము దళారుల జేబుల్లోకి పోతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చే డబ్బుకు పెట్టే ఖర్చుకు పొంతన కుదరడం లేదంటున్నారు. చేసిన పనికి లక్షల్లో ఖర్చులు చూపిస్తూ వీరన్న సొత్తును అక్రమార్కులు కాజేస్తున్నారని భక్తులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో నెరవేర్చలేదంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో దాతల సొమ్మును పక్కదారి పట్టిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న చర్యలు తీసుకునేవారే కరువయ్యారు. కొత్తకొండ వీరన్న ఆలయ ఆదాయం గత కొన్ని సంవత్సరాలుగా కోటి దాటుతున్నా వాటికి లెక్క పత్రాలు ఉండడం లేదు. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని ఆలయ అవసరాల కోసమే వినియోగిస్తున్నట్లు అధికారులు చూపిస్తున్నారు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు వస్తున్నా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. జనవరిలో నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాల జాతరలో దుకాణాల సముదాయాల టెండర్లు తక్కువ కొటేషన్ తో వేస్తూ అధిక లాభం గడిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి వారి సొమ్ముకు రక్షణ లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంపై ఓ కన్నేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, ఆలయ అభివృద్ధి పనులపై శ్రద్ధ చూపాలని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

# రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

## ప్రొఫెసర్ రమణమూర్తి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని శ్రీనివాస రామానుజన్ పాఠశాలలో ప్రముఖ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 136వ జన్మదిన వేడుకలు, పాఠశాల 19వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిట్ ప్రొఫెసర్ రమణమూర్తి మాట్లాడుతూ భారతీయ మేధాసంపన్నుల వేడుకలను పాఠశాలల్లో నిర్వహించడం దేశానికే గర్వకారణమన్నారు. విద్యార్థులు ప్రముఖ గణిత మేధావి అయిన శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినిమా దర్శకుడు, మోటివేషన్ స్పీకర్ కేవీ.ప్రదీప్ మాట్లాడుతూ వజ్రం కంటే విలువైనది విద్యార్థుల ప్రవర్తన అన్నారు. ఉపాధ్యాయులు ఆ వజ్రలను సాన పట్టడంతో వారి విలువ పెరుగుతుందన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఏఐసీసీ మెంబర్ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానం పొందడంతో పాటు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముచ్చ రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను సమగ్ర వ్యక్తిత్వ వికాసం గల పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల కరెస్పాండంట్ అరుణ రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా, సాంస్కృతిక, క్రీడారంగాల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. ఈవేడుకలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

# 50 పడకలతో ప్రత్యేక వార్డు

**వరంగల్ వాయిస్, ఎంజీఎం :** కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆసుపత్రిలో 50 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశామన్నారు. 70 కి పైగా కోవిడ్ వెంటిలెటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. శుక్రవారం ఎంజీఎం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ వార్డుకు సంబంధించి పూర్తి స్థాయి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని వెల్లడించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మహమ్మారి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేస్తున్నామని వెల్లడించారు. అయితే భూపాలపల్లి జిల్లాకు చెందిన 65 సంవత్సరాల వృద్ధురాలు కరోనా లక్షణాలతో ఎంజీఎంలో చేరినట్లు తెలిపారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న కరోనా కొత్త వేరియంట్ జేఎన్–1 తో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com